ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
గురువారం 20 ఫిబ్రవరి 2025



ఆన్‌లైన్‌లో రవాణాశాఖ సేవలు

పార్వతీపురం, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వం, అదనపు చెల్లింపులు వంటి భారం లేకుండా ఇంటివద్ద నుంచే ఆన్‌లైన్ ద్వారా రవాణా శాఖ సేవలు పొందొచ్చని జిల్లా రవాణా శాఖాధికారి దుర్గా ప్రసాద్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు నేరుగా పరీక్షలకు హాజరై డ్రైవింగ్ లైసెన్స్‌లు పొందొచ్చన్నారు. లైసెన్స్ పునరుద్ధరణకు కూడా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఎటువంటి ఏజెంట్లు, సిబ్బంది ప్రమేయం అవసరం లేదన్నారు. వాహన పరివాహన్, ఎస్ఏఆర్ఏటీహెచ్ఐ వెబ్‌సైట్లు పనిచేస్తున్నట్టు చెప్పారు.

సమస్యల స్టేషన్లు!


పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్ లో బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు

- ఆర్టీసీ బస్ స్టేషన్లలో మౌలిక వసతుల కొరత
- ప్రయాణికులకు కలుషిత నీరే గతి..
- కంపుకొడుతున్న మరుగుదొడ్లు
- కాంప్లెక్స్ పరిసరాల్లో పారిశుధ్య లోపం
- అధికారుల పర్యవేక్షణ కరువు
- పెదవి విరుస్తున్న జిల్లావాసులు

పార్వతీపురం టౌన్, ఫిబ్రవరి 19: జిల్లాలో ఆర్టీసీ కాంప్లెక్స్‌లు సమస్యలకు కేరాఫ్‌గా నిలిచాయి. ప్రధానంగా తాగునీరు, మరుగుదొడ్ల వసతులు కొరవడ్డాయి. బస్ స్టేషన్ల పరిసర ప్రాంతాలు పారిశుధ్య లోపంతో దర్శనమిస్తున్నాయి. దీంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. బస్సుల కోసం నిరీక్షించలేని పరిస్థితి. రూ.లక్షల్లో ఆదాయం వస్తున్నా..ఆర్టీసీ కాంపెక్స్‌ల్లో మౌలిక వసతులు కల్పించకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో పార్వతీపురం, పాలకొండ, సాలూరులో ఆర్టీసీ డిపోలున్నాయి. వాటి పరిధిలో 278 బస్సులు ఉన్నాయి. రోజుకు సుమారు 95 వేల మంది ప్రయాణాలు సాగిస్తున్నారు. దీంతో ఆయా డిపోలకు రోజువారీ ఆదాయం రూ.31 లక్షల వరకు వస్తుంది. అయినా బస్ స్టేషన్లలో కనీస సౌకర్యాలు కల్పించకపోవడంపై ప్రయాణికులు మండిపడుతున్నారు. ఇప్పటికే పెళ్లిళ్ల సీజన్ ప్రారంభమైంది. దీంతో మూడు డిపోల్లో ఒక్కసారిగా రద్దీ పెరిగింది. మరోవైపు ఎండల తీవ్రత కూడా అధికమైంది. ఈ నేపథ్యంలో ఆర్టీసీ కాంప్లెక్స్‌ల్లో ప్రయాణికులకు సురక్షిత నీటిని అందించ లేకపోతున్నారు. పార్వతీపురం, పాలకొండ, సాలూరు డిపోల్లో మరుగుదొడ్ల నిర్వహణపై కూడా అధికారులు శ్రద్ధ చూపడం లేదు. మరోవైపు బస్ స్టేషన్లలో ప్రయాణికులకు సరిపడా కుర్చీలను కూడా ఏర్పాటు చేయడం లేదు. దీంతో ప్రజలు బస్సుల కోసం గంటల తరబడి నిలబడాల్సి వస్తోంది. సేవా రుసుం కింద ప్రతి ప్రయాణికుడి నుంచి రూపాయి నుంచి రూ.3 వరకు వసూలు చేస్తున్న ఆర్టీసీ అధికారులు బస్ స్టేషన్లలో సౌకర్యాలెందుకు కల్పించడం లేదని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు.


కాంప్లెక్స్‌లో మురుగు కాలువ పక్కన ఉన్న తాగునీటి కొళాయిలు

జిల్లా కేంద్రంలో ఇలా..

జిల్లాకేంద్రం పార్వతీపురం ఆర్టీసీ డిపో నుంచి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు, పశ్చిమ, కృష్ణ, విజయవాడ తదితర సుదూర ప్రాంతాలకు రోజూ బస్సులు రాకపోకలు సాగిస్తున్నాయి. ఆయా జిల్లాలతో పాటు ఒడిశా నుంచి కూడా జిల్లాకేంద్రానికి బస్సులు వస్తుంటాయి. పార్వతీపురం డిపో నుంచి రోజుకు 10వేల నుంచి 15 వేల మంది వరకు ప్రయాణిస్తుంటారు. దీంతో ఆర్టీసీ కాంప్లెక్స్ నిత్యం రద్దీగా ఉంటుంది. అయితే ఇక్కడి ప్రయాణి కులకు సురక్షిత నీరు అందడం లేదు. దీంతో వాటర్ బాటిళ్లు కొనుక్కోవల్సి వస్తోంది. కాంప్లెక్స్ పరిధిలో మురుగు కాలువల సమీపంలోనే తాగునీటి కొళాయిలను ఏర్పాటు చేయడంతో వాటిని ఎవరూ వినియోగించడం లేదు. కలుషిత నీటిని

(మిగతా 8వ పేజీలో...)


నిర్వహణకు నోచని మరుగుదొడ్లు

గంజాయి రవాణాదారులపై షీట్లు

- వినియోగదారులపై కూడా...
- ఉత్తరాంధ్ర జిల్లాల ఎస్పీలతో డీఐజీ గోపినాథ్ జట్టీ వీడియో కాన్ఫరెన్స్
- మహిళల భద్రతపై ప్రత్యేకంగా దృష్టిసారించాల్సిందిగా ఆదేశం

విశాఖపట్నం/బెలగాం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణాదారులు, వినియోగదారులపై షీట్లు ఓపెన్ చేయాలని విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్ జట్టీ ఆదేశించారు. ఉత్తరాంధ్ర జిల్లాల ఎస్పీలతో ఆయన బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా గోపినాథ్ మాట్లాడుతూ గంజాయి రవాణాదారులు, విక్రయదారుల ఆస్తుల స్వాధీనం, పీడీ యాక్టు నమోదు, కేసుల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. హిట్ అండ్ రన్ కేసుల్లో బాధితులకు పరిహారం అందేలా చూడాలన్నారు. రహదారి భద్రతపై ప్రజలకు అవగాహన కలిగేలా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పోక్సో, మహిళలపై దాడుల కేసులను త్వరగా విచారణకు తీసుకువెళ్లాలని, బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. ఇంకా ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందుతున్న అర్జీల పరిష్కారం, సైబర్ నేరాలు, నాన్ బెయిల్‌బుల్ వారెంట్లు, ఇతర కేసులపై డీఐజీ సమీక్షించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పీలు తుహిన్ సిన్హా, జిందాల్, అమిత్‌బర్దార్, కేవీ మహేశ్వరరెడ్డి, ఎస్పీ మాధవరెడ్డి, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎస్పీ మాధవరెడ్డి

గృహ నిర్మాణాలు వేగవంతం

- ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో అశుతోష్ శ్రీవాత్సవ

పార్వతీపురం/కురుపాం/గుమ్మలక్ష్మీపురం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి జన్‌మన్ యోజన పథకం కింద మంజూరైన గృహ నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో అశుతోష్ శ్రీవాత్సవ ఆదేశించారు. బుధవారం కురుపాం ఎంపీడీవో కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మండలంలో వివిధ దశల్లో ఉన్న ఇళ్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మార్చి నెలాఖరులోగా మిగిలిన 50 శాతం గృహ నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు. ఈ సమీక్షలో ఎంపీడీవో జె.ఉమామహేశ్వరి, హౌసింగ్ ఏఈ అచ్చయ్యమ్మ, వర్క్ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

● గుమ్మలక్ష్మీపురం మండలం ఎస్‌కేపాడులో హార్టికల్చర్ నర్సరీని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో శ్రీవాత్సవ సందర్శించారు. అక్కడ వాటర్‌షెడ్ పథకంలో భాగంగా జరుగుతున్న అభివృద్ధి పనులు, మొక్కలు నాటే కార్యక్రమం, మంగళాపురం, పెదకర్జ గ్రామాల్లో ఊటగుంటల నిర్మాణం పరిశీలించారు. ఆయన వెంట ఏపీడీ సురేష్‌నాయుడు, పీవో పులినాయుడు తదితరులు ఉన్నారు.

● నిర్ణీత గడువులోగా అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ఇన్‌చార్జి పీవో ఆదేశించారు. బుధవారం సాయంత్రం పార్వతీపురం ఐటీడీఏ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలన్నారు. ఏపీవో మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.


గృహ నిర్మాణాలపై సమీక్షిస్తున్న ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో

ఇంకా 44 శాతమేనా?

- ఎంఎస్ఎంఈ సర్వే జాప్యంపై కలెక్టర్ అసంతృప్తి



పార్వతీపురం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) సర్వే ఇంకా 44 శాతమే కావడంపై కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ అసంతృప్తి వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు, సిబ్బందితో బుధవారం కలెక్టరేట్ నుంచి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎంఎస్ఎంఈ సర్వేను వేగవంతం చేయాలని ఆయన ఆదేశించారు. 12,376 యూనిట్ల మేర అంటే దాదాపు 56 శాతం సర్వేను తక్షణమే పూర్తి చేయాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ఇదే పనిపై ఉండాలని సూచించారు. పార్వతీపురం, సాలూరు, పాలకొండ ప్రాంతాల్లో సర్వే పూర్తికి అన్ని అవకాశాలు ఉన్నాయని , అయినా ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నించారు. ఈ సర్వే పూర్తయితే సంబంధిత యూనిట్లకు ప్రయోజనం కలుగుతుందన్నారు.

సిరులు కురిపిస్తున్న స్టార్ ఫ్రూట్స్

- పెరటితోటలో భాగంగా పెంపకం
- ఆదాయాన్నిస్తున్న వైనం

6లో

శివాజీ పోరాటం ఆదర్శం

- మంత్రి గుమ్మిడి సంధ్యారాణి
- సాలూరులో ఘనంగా జయంతి వేడుకలు

6లో



దుగ్గిలోనే గజరాజులు

కొమరాడ, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): కొమరాడ మండలంలో దుగ్గి గ్రామం నుంచి ఏనుగులు కదలడం లేదు. దీంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. గత కొద్ది రోజులుగా ఆ ప్రాంతంలోనే సంచరిస్తున్న గజరాజులు వాణిజ్య పంటలైన అరటి, మొక్కజొన్న, పుచ్చకాయతో పాటు కూరగాయలను ధ్వంసం చేశాయి. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. తక్షణమే వాటిని తరలించాలని డిమాండ్ చేస్తున్నారు.

కల నెరవేరేనా.. సాగునీరందేనా?

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి దృష్టికి మూడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల అంశం
- సానుకూల స్పందన.. ఆనందంలో రెండు మండలాల రైతులు
- పనులు పూర్తయితే ఎనిమిది వేల ఎకరాలు సస్యశ్యామలం
- గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే పనులకు గ్రీన్‌సిగ్నల్
- ఎన్నికల అనంతరం మోకాలడ్డిన నాటి వైసీపీ సర్కారు



జియ్యమ్మవలస, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం పుణ్యమా అని కురుపాం నియోజకవర్గంలో గరుగుబిల్లి, జియ్యమ్మవలస రెండు మండలాల్లో లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులకు మోక్షం కలగ లేదు. దీంతో దశాబ్దాల నాటి రైతుల కల నెరవేరలేదు. వారి ఆశలు ఫలించలేదు. ఎనిమిది పంచాయతీల పరిధిలో ఎనిమిది వేల ఎకరాలకు సాగునీరందకపోవడంతో ఏటా వరుణుడిపై ఆధారపడి సాగు చేయాల్సి వస్తోంది. ప్రస్తుతం అన్నదాత లంతా కూటమి ప్రభుత్వంపైనే ఆశలు పెట్టుకున్నారు. తాజాగా దీనిపై మంత్రులు సానుకూలంగా స్పందించడంతో వారిలో ఆశలు చిగురిస్తున్నాయి.

ఇదీ పరిస్థితి..

● గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నాగూరు, తోటపల్లి, చింతలబెలగాంలో లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు మంజూరు చేశారు. గరుగుబిల్లి మండలంలో తోటపల్లి, సంతోషపురం, నాగూరు పరిధిలో నందివానివలస, తోటపల్లి, పిట్టలమెట్ట, ఖడ్గవలస, సంతోషపురం, కొత్త సంతోషపురం, నాగూరు గ్రామాల్లో 5274 ఎకరాలకు సాగునీరందే పరిస్థితి ఉంది. నాగూరు, తోటపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల కోసం అప్పట్లో రూ. 26.77 కోట్లు కేటాయించారు.

● జియ్యమ్మవలస మండలంలో చింతలబెలగాం వద్ద మరో లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు మంజూరు చేశారు. దీని ద్వారా ఆ మండలంలో చింతలబెలగాం, కుదమ, టీఎన్ వలస, కేటీ వాడ, పరజపాడు పరిధిలో చింతలబెలగాం, రాజయ్యపేట, తుమ్మల దత్తివలస, సింగనాపురం, చిన కుదమ, పెదకుదమ, గౌరీపురం, గంగరాజపురం గదబవలస, కేటీ వాడ, నీచుకవలస, తురక నాయుడువలస గ్రామాల్లో 2,726 ఎకరాలకు సాగునీరందించే అవకాశం ఉంది. దీనికి గాను అప్పట్లో రూ. 17.25 కోట్లు మంజూరు చేశారు.

● నీటి పారుదలశాఖ చీఫ్ ఇంజనీర్ల బృందం పరిశీలించి.. ఈ మూడు ప్రాజెక్టులకు హైడ్రాలిక్ క్లియరెన్స్ కూడా ఇచ్చింది. మొత్తంగా రూ. 45.13 కోట్లతో ఆయా ప్రాజెక్టుల పనులు చేపట్టడానికి సిద్ధమవుతున్న తరుణంలో ఎన్నికలు జరగడం.. వైసీపీ అధికారంలోకి రావడంతో సీన్ మారింది. గత ప్రభుత్వం వాటిని రద్దు చేయడంతో పనులేవీ జరగలేదు.

చిగురిస్తున్న ఆశలు

జియ్యమ్మవలస, గరుగుబిల్లి మండలాల పరిధిలో చింతలబెలగాం, తోటపల్లి, నాగూరులలో లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల విషయంలో రైతులకు మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు ఆధ్వర్యంలో స్థానిక టీడీపీ నాయకులు ఈ విషయాన్ని ఇటీవల జిల్లా ఇన్‌చార్జి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, మంత్రి గుమ్మిడి సంధ్యారాణి దృష్టికి తెచ్చారు. దీనిపై వారు సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది. ఏదేమైనా బీడువారిన భూములు సాగులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ముగిసిన ఇంటర్ ప్రాక్టికల్స్

బెలగాం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఇంటర్ విద్యార్థుల ప్రాక్టికల్స్ ప్రశాంతంగా ముగిశాయని ఇంటర్మీడియట్ విద్యా శాఖాధికారి డి.మంజులవీణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బంది లేకుండా పరీక్షలకు హాజరయ్యారని పేర్కొన్నారు. జిల్లాలోని 40 కేంద్రాల్లో ఒకేషనల్ , 37 కేంద్రాల్లో జనరల్ విభాగంలో ప్రాక్టికల్స్ నిర్వహించామని తెలిపారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు.

జరజాపుపేటలో నేటి నుంచి నాటిక పోటీలు

6లో

'ఉపాధి హామీ'కీ ఉందో యాప్

- వేతనదారుల్లో అవగాహన తక్కువ
- జిల్లాలో 421 మంది మాత్రమే వినియోగం

6లో



నిబంధనలు పాటించాల్సిందే..

- డ్వామా పీడీ రామచంద్రరావు

గరుగుబిల్లి, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): నిబంధనల మేరకు విధులు నిర్వహించాలని లేకుంటే చర్యలు తప్పవని డ్వామా పీడీ కె.రామచంద్రరావు హెచ్చరించారు. బుధవారం గొట్టివలసతో పాటు పలు గ్రామాల్లో ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'పనులు గుర్తించిన ప్రాంతాల్లో విధిగా ఎన్ఎంఎస్ఎస్ యాప్‌లో వేతనదారుల వివరాలు నమోదు చేయాలి. గ్రూపులకు సంబంధించి మేట్లు నిర్వహణ బాధ్యతలు తీసుకోవాలి. ముందస్తుగా కొలతలు అందించి పనులు నిర్వహించాలి. వేతనదారుల సంఖ్య పెంచడంతో పాటు సమయపాలన పాటించాలి. రెండు పూటలా పనులు నిర్వహించాలి. పనులు నిర్వహించే ప్రాంతాల్లో తాగునీరు, ఓఆర్ఎస్, టెంట్లు ఏర్పాటు చేయాలి. బోగస్ మస్తర్లకు తావివ్వరాదు. వేతనదారులు నిర్వహించిన పనికి, వేతనానికి వ్యత్యాసం ఉంటే రికవరీలు తప్పవు. కూలీల సంఖ్య తగ్గితే సంబంధిత క్షేత్ర సహాయకులపై చర్యలు తీసుకుంటాం. జిల్లాలోని 15 మండలాల్లో మంజూరు చేసిన ప్రహరీ నిర్మాణాలు నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలి. లేకుంటే చెల్లింపులు జరగవు. సకాలంలో పూర్తి చేయకుంటే పనులు రద్దు చేస్తాం. క్షేత్రస్థాయిలో పనులను ఎంపీడీవోలు, ఉపాధి ఏపీవోలు, టెక్నికల్ అసిస్టెంట్లు పరిశీలించాలి.' అని తెలిపారు.



గొట్టివలసలో వేతనదారులకు అవగాహన కల్పిస్తున్న డ్వామా పీడీ

సిరులు కురిపిస్తున్న స్టార్ ఫ్రూట్స్



- పెరటి తోటలో పెంపకం
- ఆదాయాన్నిస్తున్న వైనం


వేణుగోపాలరావు పెరటిలోని చెట్టుకు ఇలా...


విక్రయానికి సిద్ధంగా స్టార్ ఫ్రూట్స్

రాజాం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి)

సరదాగా ఇంటి ప్రాంగణంలో నాటిన మొక్కలు ఇప్పుడు ఆదాయ వనరుగా మారాయి. కాసుల ఫలాలు కురిపిస్తున్నాయి. ఆ కుటుంబంలో ఆనందాన్ని నింపుతున్నాయి. ఆ ఫలాల కథేంటో తెలుసుకోవాలంటే రాజాం వెళ్లాల్సిందే. పట్టణానికి చెందిన పాండూరి వేణుగోపాలరావు పెరడుతో పాటు ఖాళీగా ఉన్న ప్రదేశంలో పది స్టార్ ఫ్రూట్స్ మొక్కలను నాటాడు. అవి పెద్దవై ప్రస్తుతం ఫలసాయం ఇస్తున్నాయి. కాయలు, పండ్లను జనాలు ఆసక్తిగా కొనుగోలు చేస్తుండడంతో ఆదాయం వస్తోంది. వేణుగోపాలరావు తన ఇంటి ప్రాంగణంలో వివిధ రకాల పండ్ల జాతికి సంబంధించిన మొక్కలు నాటారు. ఈ క్రమంలో తెలిసిన వారి సూచనతో స్టార్‌ఫ్రూట్స్ మొక్కలు కూడా నాటారు. ప్రస్తుతం అవి ఏపుగా పెరిగి పండ్లను ఇస్తున్నాయి. ప్రతి రోజూ పది కిలోల వరకూ పండ్లు వస్తున్నాయి. బహిరంగ మార్కెట్‌లో వీటి ధర రూ.130 వరకూ ఉంటోంది. అనేక అనారోగ్య సమస్యలకు స్టార్‌ఫ్రూట్స్ పరిష్కారం చూపుతాయని వైద్య నిపుణులు చెబుతుండడంతో వీటిని కొనుగోలు చేసేందుకు జనాలు కూడా ఆసక్తి కనబరుస్తున్నారు. సరదాగా పెరటి తోటలో వేసుకుంటే ఇదో జీవనోపాధిగా మారిందని వేణుగోపాలరావు చెబుతున్నారు.

● ఔషధ గుణాలు ఎన్నో..

ఈ స్టార్ ఫ్రూట్స్ ఉష్ణోగ్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లోనే పండుతాయని ఉద్యాన శాఖ అధికారులు చెబుతున్నారు. రాజాం పట్టణంలో ఇవి పండుతుండడం విశేషమే. స్టార్‌ఫ్రూట్స్‌లో చాలా రకాల ఔషధ గుణాలు ఉండడంతో ఎక్కువ మంది విరివిగా తింటుంటారు. పండ్లు పసుపు రంగులో ఉండి తియ్యగా ఉంటాయి. పచ్చివి పచ్చగా ఉండి పుల్లగా ఉంటాయి. వీటి ఆకృతిని బట్టి స్టార్‌ఫ్రూట్స్‌గా పిలుస్తారు. స్టార్‌ఫ్రూట్స్‌లో విటమిన్ సి, బీ2, బీ6, బీ9 ఉంటాయని వైద్యులు చెబుతున్నారు. ఫైబర్, పొటాషియం, జింక్, ఐరన్, కాల్షియం, సోడియం, కాపర్, మెగ్నీషియం వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయని అంటున్నారు. స్టార్ ఫ్రూట్స్‌లో కొవ్వు తక్కువగా ఉంటుంది. అధిక కొలెస్ట్రాల్‌తో బాధ పడేవారు వీటిని తీసుకుంటే చాలా మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

● సరదాగా నాటినవే..

తెలిసిన వారు చెబితే సరదాగా ఈ స్టార్‌ఫ్రూట్స్ మొక్కలను నాటాను. ఇంటి ప్రాంగణంలో ఖాళీగా ఉండడంతో వాటిని వేశా. ప్రస్తుతానికి పక్వానికి వచ్చాయి. కుటుంబ సభ్యులు, బంధువులకు పంచిపెట్టగా.. మిగిలినవి విక్రయిస్తున్నాం.

-పాండూరి వేణుగోపాలరావు, రాజాం

శివాజీ పోరాటం ఆదర్శం

● మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

సాలూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): హిందూ సామ్రాజ్య స్థాపన కోసం కృషి చేసిన గొప్ప పోరాట యోధుడు ఛత్రపతి శివాజీ అని... ఆయన పోరాటాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. శివాజీ జయంతి సందర్భంగా పట్టణంలో ఉన్న ఆయన విగ్రహానికి మంత్రి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ క్రమశిక్షణ, ధైర్య సాహసాలు గల గొప్ప నాయకుడు శివాజీ అని కీర్తించారు. యుద్ధ తంత్రాలతోనే కాకుండా పరిపాలనా విధానంలో కూడా శివాజీ భారతదేశ రాజులలో అగ్రగణ్యుడని గుర్తు చేశారు. ప్రజల కోసమే ప్రభువు అనే సూత్రాన్ని పాటించి.. వారి సంక్షేమం కోసం పాటుపడిన వ్యక్తి శివాజీ అని అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.


శివాజీ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న మంత్రి సంధ్యారాణి

గోవులు చల్లగా...

● జిల్లా వ్యాప్తంగా గోశాలల నిర్మాణం



విజయనగరం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గోశాలల నిర్మాణం చురుగ్గా సాగుతోంది. జిల్లా వ్యాప్తంగా 1,148 గోశాలలు మంజూరయ్యాయి. ఇప్పటి వరకూ 250 వరకూ పూర్తయ్యాయి. మిగతా వాటి నిర్మాణం వివిధ దశల్లో ఉంది. వీటి కోసం రూ.71.62 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. పశువుల సంరక్షణకు ప్రభుత్వం పాడి రైతులకు ప్రోత్సాహం అందించాలని నిర్ణయించింది. పశువుల శాలలను మంజూరు చేస్తోంది. 2014లో అధి కారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం అప్పట్లో పశువుల సంరక్షణ కుగాను షెడ్ల నిర్మాణానికి ముందుకొచ్చింది. మినీ గోకులాలను మంజూరు చేసింది. ఉపాధి హామీ నిధులను అందుకు కేటాయించింది. ఇప్పుడు గోశాలల పేరిట మళ్లీ నిధులు మంజూరు చేస్తోంది.

● కేటాయింపులు ఇలా...

జిల్లాలోని ఏడు నియోజకవర్గాలకు 1,148 గోశాలలను కేటాయించారు. గజపతినగరం నియోజకవర్గానికి 369, ఎస్.కోట నియోజకవర్గానికి 166, చీపురుపల్లికి 75, బొబ్బిలికి 278, రాజాంకు 25, విజయనగరానికి 26, నెల్లిమర్లకు 200, సాలూరు నియోజకవర్గంలోని మెంటాడ మండలానికి 9 గోశాలలను కేటాయించారు. వీటి నిర్మాణానికి ఉపాధి హామీ జాబ్ కార్డును తప్పనిసరి చేశారు. గ్రామసభ ఆమోదం తీసుకున్నారు. పశువుల షెడ్లకు 90 శాతం, గొర్రెలు, మేకల షెడ్లకు 70 శాతం సబ్సిడీ ప్రకటించారు. పశువుల శాలకు 10 శాతం, గొర్రెలు, మేకల షెడ్లకు 30 శాతం యజమానుల వాటాగా బ్యాంకు డీడీలు తీయించారు. షెడ్ల నిర్మాణం పూర్తయిన తరువాత ఉపాధి హామీ నిధులను యజమానుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారు. ఒక్కో షెడ్డుకు రూ.2.30 లక్షల వంతున ప్రభుత్వం మంజూరు చేసింది.

● గతంలో గోకులాల పేరిట..

పశువులకు ఎండ, వానల నుంచి రక్షణ... పరిశుభ్రమైన వాతావరణం.. అంటువ్యాధుల నియంత్రణ.. నాణ్యమైన పాల ఉత్పత్తి.. దూడల మరణాలు అరికట్టడం.. ఆధునాతన పద్ధతుల్లో పశు పెంపకానికి కొత్తగా పశువుల షెడ్లకు టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోంది. 2014లో టీడీపీ ప్రభుత్వం పెద్ద ఎత్తున గోకులాలను ఏర్పాటు చేసింది. అప్పట్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 3,888 గోకులాలను మంజూరు చేసింది. ఇందుకుగాను రూ.56.3 కోట్లు కేటాయించింది. అప్పట్లో 2, 4, 6 పశువులకు షెడ్లను మంజూరు చేశారు. అప్పట్లో 967 గోకులాల నిర్మాణం పూర్తయ్యాయి. మిగతావి వివిధ దశల్లో ఉన్నాయి. ఇంతలో ఎన్నికలు రావడం, కొత్త ప్రభుత్వం రావడం జరిగిపోయింది. దీంతో గురుకులాల నిర్మాణం మరుగున పడిపోయింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పశువుల షెడ్ల నిర్మాణం పెద్ద ఎత్తున చేపట్టింది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

● చురుగ్గా నిర్మాణం..

జిల్లా వ్యాప్తంగా గోశాలల నిర్మాణం చురుగ్గా జరుగుతోంది. ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా పశువుల షెడ్ల నిర్మాణానికి లబ్ధిదారులను ఎంపిక చేశాం. వాటి నిర్మాణంపై కూడా దృష్టి సారించాం. సకాలంలో పనులు పూర్తయ్యేలా చర్యలు చేపడతాం.

-వైవీ రమణ, జేడీ, పశుసంవర్థక శాఖ, విజయనగరం

పోలమాంబ ఆదాయం రూ.6.56 లక్షలు

మక్కువ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రుల ఆరాధ్యదేవత శంబర పోలమాంబ అమ్మవారి నాలుగో వారం జాతర ఆదాయం రూ.6 లక్షల 56 వేల 270 వచ్చినట్టు ఆలయ ఈవో వి.వి.సూర్యనారాయణ బుధవారం తెలిపారు. శీఘ్ర దర్శనం రూ.100 టిక్కెట్ ద్వారా రూ.రెండు లక్షల 49 వేల 400, రూ.20 టిక్కెట్ ద్వారా రూ.79 వేల 760, కేశఖండన ద్వారా రూ.11 వేల 280 వచ్చినట్టు వివరించారు. మహాన్నదాన విరాళాల ద్వారా రూ.లక్షా 39 వేల 260, లడ్డూ ప్రసాదం విక్రయంతో రూ.72 వేల 780, పులిహోరా ప్రసాదం ద్వారా రూ.లక్ష 3 వేల 790 ఆదాయం వచ్చినట్టు వివరించారు.

ఉత్సాహంగా బాడీ బిల్డింగ్ పోటీలు

బొబ్బిలి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాజాకళాశాల మైదానంలో బుధవారం రాత్రి ఉత్తరాంధ్ర స్థాయి బాడీ బిల్డింగ్ చాంపియన్ షిప్-2025 కార్యక్రమాన్ని జిల్లా బీజేపీ అధ్యక్షుడు రాజేశ్ వర్మ ప్రారంభించారు. ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా ఎమ్మెల్యే ఆర్‌వీఎస్‌కేకే రంగారావు (బేబీనాయన) ప్రోత్సాహంతో నిర్వహించిన ఈ పోటీలకు విశేష స్పందన లభించింది. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి సుమారు 110 మంది బాడీ బిల్డర్లు పోటీలలో పాల్గొన్నారు. 45 కిలోల నుంచి 80 కిలోల వరకు ఏడు విభాగాలలో ఈ పోటీలు నిర్వహించారు. విజేతలకు విభాగాల వారీగా నగదు బహుమతులను, జ్ఞాపికలను అందజేశారు.



బాడీబిల్డింగ్ పోటీల్లో పాల్గొన్న యువకులు

ఉపాధి హామీకీ ఉందో యాప్



- వేతనదారుల్లో అవగాహన లేమి
- జిల్లాలో 421 మంది మాత్రమే వినియోగం

కొమరాడ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న వేతనదారులకు కేంద్ర ప్రభుత్వం జన్‌మన్‌రేగ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ యాప్ ద్వారా తక్షణమే సమగ్ర వివరాలు తెలుసుకునే వీలుంది. కూలీలు ఇప్పటి వరకు ఏ సమాచారం కావాలన్నా ఎంపీడీవో, తపాలా కార్యాలయాలు, ఉపాధి సిబ్బంది చుట్టూ ప్రదక్షిణలు చేసేవారు. ఇక నుంచి ఆ అవసరం ఉండకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఈ యాప్‌ను తీసుకువచ్చింది. యాప్ వినియోగంలో మాత్రం వేతనదారులు చాలా వెనుకబడి ఉన్నారని చెప్పక తప్పదు. జిల్లా వ్యాప్తంగా లక్షలాది మంది వేతనదారులు ఉన్నప్పటికీ వందల సంఖ్యలో ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని వినియోగించుకుంటున్నట్లు చెబుతున్నారు. స్మార్ట్ ఫోన్ ఉన్న ప్రతి ఒక్కరూ ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుంటే చిటికెలో సమగ్ర వివరాలు తెలుసుకోవచ్చును.

ఏఏ వివరాలు ఉంటాయంటే..

సెల్‌ఫోన్‌లోని గూగుల్ ప్లే స్టోర్‌లో జన్ మన్ రేగ (జేఏఎన్‌ఎంఏఎన్‌ఆర్‌ఈజీఏ) యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. అందులో వేతనదారుల వివరాలు, హాజరు, వేతనాలు, తదితర వివరాలు క్లిక్ చేస్తే బ్లాక్ తెరుచుకుంటుంది. రాష్ట్రం, జిల్లా, మండలం, గ్రామ పంచాయతీ, ఉపాధి జాబ్‌కార్డు సంఖ్య నమోదు చేసి క్లిక్ చేస్తే వివరాలు ప్రత్యక్షమవుతాయి. వేతనదారుని పేరుపై క్లిక్ చేస్తే పనిచేసిన రోజులు, వేతనం మొత్తం, ఏ బ్యాంకు ఖాతాలో, ఎంత నగదు జమైంది తదితర వివరాలు కనిపిస్తాయి. ఒకవేళ వేతనదారుడికి నగదు జమ కాకపోతే కారణాలు స్పష్టంగా ఉంటాయి. దాంతో పాటు ఉపాధి పథకంలో చేపట్టే పనుల వివరాలు, సమాచారం ఉంటుంది.

అక్రమాలపై ఫిర్యాదు చేయవచ్చు..

ఉపాధి పనుల్లో అక్రమాలు, అవినీతి జరిగితే యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. నిబంధనలకు విరుద్ధంగా యంత్రాలతో పనిచేసినా.. ఉపాధి సిబ్బంది బిల్లులు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టినా ఫిర్యాదు చేయవచ్చు. ఈ వివరాలు అన్ని భాషల్లో అందుబాటులో ఉన్నాయి. ఉపాధి హామీ పథకంలో పారదర్శకతకు పెద్ద పీట వేయాలన్న సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం యాప్‌ను రూపొందించింది.

అవగాహన అవసరం..

పార్వతీపురం మన్యం జిల్లాలో 3.53 లక్షల ఫ్యామిలీ జాబ్‌కార్డులు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా సుమారు 5.92 లక్షల మంది పనులకు వెళుతున్నారు. అయినప్పటికీ ఇప్పటి వరకు కేవలం 421 మంది మాత్రమే ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నట్లు తెలుస్తోంది. లక్షల్లో వేతనదారులు ఉన్నప్పటికీ ఈ యాప్‌ను వినియోగించేవారు వందల్లో ఉండడం గమనార్హం. వీరందరికీ జన్ మన్ రేగ యాప్‌పై అవగాహన కల్పించవలసిన అవసరం ఉంది. యాప్ అందుబాటులో ఉన్న విషయం చాలామందికి తెలియదు. ఉపాధి హామీ సిబ్బంది క్షేత్రస్థాయిలో పనులు చేసే చోట కూలీలకు అవగాహన కల్పిస్తే ఉపయోగంగా ఉంటుందని పలువురు సూచిస్తున్నారు.

యాప్ ఉపయోగాలను వివరిస్తున్నాం..

జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ జన్‌మన్‌రేగ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకునేలా అవగాహన కల్పిస్తున్నాం. ప్రస్తుతం జరుగుతున్న పనుల వద్ద క్షేత్ర సహాయకులు వేతనదారులకు యాప్ ఆవశ్యకతను వివరిస్తున్నారు.

-బాలకృష్ణ, ఏపీఓ, కొమరాడ

తీరు మార్చుకోండి.. చిందులెయ్యకండి

● మంత్రి కొండపల్లి శ్రీనివాస్



మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు తదితరులు

విజయనగరం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొంతమంది వైసీపీ నేతలు వారు చెప్పిన పనిచెయ్యని అధికారులపై చిందులేస్తూ, బెదిరింపులకు పాల్పడుతున్న వైసీపీ నేతలు ఇకపై తీరు మార్చుకోవాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హెచ్చరించారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే అదితితో కలిసి నిర్వహించినవిలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం మారి 8 నెలల కావస్తున్నా రూల్స్‌కు విరుద్ధంగా పనులు చెయ్యమంటే ఎలా చేస్తారని ప్రశ్నించారు. ఇదేం వైసీపీ ప్రభుత్వం కాదన్నారు. కూటమి ప్రభుత్వంలో అక్రమాలు అన్యాయాలకు తావులేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి లోకేశ్ పాలనలో అభివృద్ధి, సంక్షేమంపై అధికారులు దృష్టిసారించారన్నారు. పార్టీలకు అతీతంగా, సంక్షేమ ఫలాలు అందిస్తున్నామన్నారు. ఉద్యోగ నియామకాలు, అధికారుల బదిలీలు, గ్రామాల్లో అభివృద్ధి పనులు అక్రమాలకు తావులేకుండా జరుగుతున్నాయన్నారు.

● అసెంబ్లీ గేటు కూడా తాకనివ్వకండి..

పదవి, పవర్ పోయే సరికి మాజీ ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే జగన్ ఏమి మాట్లాడుతున్నారో అర్థం కావటంలేదని ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతిరాజు అన్నారు. రూల్స్‌ని అనుసరించి విధులు నిర్వహిస్తున్న అధికారులపై బాహాటంగా బెదిరింపులకు పాల్పడటం ప్రజలంతా ఖండిస్తున్నారన్నారు. సుపరిపాలన అందిస్తారని, జగన్‌ను నమ్మి జనం ఓట్లు వేసి అధికారం అప్పగిస్తే విధ్వంసం సృష్టించారని విమర్శించారు. అందుకే 2024 ఎన్నికల్లో చిత్తుగా ఓడించారు. ఇప్పుడు పదవి పోయేసరికి బెదిరింపులకు దిగుతున్నారన్నారు. జగన్ తీరుమార్చుకోకుంటే. వచ్చే 2029 ఎన్నికల్లో జగన్‌ను అసెంబ్లీ గేటు కూడా తాకనీయరాదని ప్రజలను కోరారు. టీడీపీ నేతలు ప్రసాదుల ప్రసాద్, ఆల్లి బంగారుబాబు పాల్గొన్నారు.

జరజాపుపేటలో నేటి నుంచి నాటిక పోటీలు

నెల్లిమర్ల, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయితీ పరిధిలోని జరజాపుపేట గ్రామంలో ఈ నెల 20వ తేదీ (గురువారం) నుంచి ఆరిపాక బ్రహ్మానందం స్మారక రెండు రాష్ట్రాల స్థాయి నాటిక పోటీలు నిర్వహించనున్నారు. ఉపాధ్యాయుడు దివంగత ఆరిపాక బ్రహ్మానందం మాస్టారి పేరిట ఆయన కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. తొలి రోజు సాయంత్రం 7 గంటలకు హైదరాబాద్‌కు చెందిన కళాంజలి సంస్థ కళాకారులు 'రైతే రాజు' నాటికను ప్రదర్శించనున్నారు. తర్వాత కాకినాడకు చెందిన శ్రీసాయి కార్తీక్ క్రియేషన్స్ కళాకారులు 'ఎడారిలో వాన చినుకు' నాటికను ప్రదర్శించనున్నారు. రెండో రోజు శ్రీకాకుళం జిల్లా బొరివంకకు చెందిన శార్వాణి గ్రామీణ గిరిజన సాంస్కృతిక సేవా సంఘం కళాకారులు 'కొత్త పరిమళం' నాటికను, విజయనగరం సౌజన్య కళా స్రవంతి (ఉత్తరాంధ్ర) కళాకారులు 'దేవరాగం' నాటికను ప్రదర్శించనున్నారు. మూడో రోజు కరీంనగర్ చైతన్య కళాభారతి కళాకారులు 'చీకటి పువ్వు' నాటికను, విశాఖపట్నం తెలుగు కళా సమితి కళాకారులు 'నిశ్శబ్దమా నీ ఖరీదెంత?' నాటికను ప్రదర్శించనున్నారని నిర్వాహకులు తెలిపారు.


సిద్ధమైన వేదిక

అల్లం, వెల్లుల్లి ధరలు తగ్గాయ్..

● కిలో వెల్లుల్లిపై రూ.300 తగ్గుదల ● సామాన్యులకు అందుబాటులో

రాజాం రూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గతేడాది డిసెంబరు వరకూ సామాన్య, మధ్య తరగతి కుటుంబాలతో పాటు వ్యాపారులనూ అల్లాడించిన అల్లం, వెల్లుల్లి ధరలు ఎట్టకేలకు దిగివచ్చాయి. ఫలితంగా మధ్యతరగతి వర్గాలకు కొంత ఊరట లభించినట్లయింది. నోరూరించే పచ్చళ్లు పెట్టుకునే వేసవికాలం ప్రారంభంలోనే ధరలు దిగిరావడంతో హమ్మయ్యా అంటూ మగువలు ఊపిరి పీల్చుకుంటున్నారు. గతేడాది నవంబరు నుంచి ఈ ఏడాది జనవరి నెలాఖరు వరకూ కిలో వెల్లుల్లి రూ.450 నుంచి 500 పలకగా ప్రస్తుతం మార్కెట్లో రూ. 160 నుంచి 200కే రిటైల్‌గా లభ్యమవుతున్నాయి. గడచిన మూడు నెలల్లో కిలో అల్లం ధర సైతం రూ.300-350 ఉండగా ప్రస్తుతం మార్కెట్‌లో రూ.100కే దొరుకుతోంది. హోల్‌సేల్ ధరలో మరింత తక్కువగా ఉన్నాయి. నాణ్యమైన వెల్లుల్లి ధర కిలో రూ.500 ఉన్న సమయంలో వ్యాపారులు సైతం భీతిల్లే పరిస్థితి నెలకొంది. పెద్ద సంఖ్యలో కొనుగోలు చేసే హోల్‌సేల్ వ్యాపారులు సైతం భారీగా పెరిగిన ధరల్ని వినియోగదారులు కొనుగోలు చేస్తారా అనే సందేహంతో తక్కువ మొత్తం కొనుగోలు చేసేవారు. అయితే తాజాగా కిలో వెల్లుల్లిపై సుమారుగా రూ.300, అల్లంపై సుమారుగా రూ.200 తగ్గడంతో ఇటు వ్యాపారులు, అటు కొనుగోలుదారులు ఊపిరి పీల్చుకుంటున్నారు. గడచిన మూడు నెలల్లో వెల్లుల్లి, అల్లం ఉత్పత్తులు భారీగా తగ్గుముఖం పట్టడంతో ధరలు పెరిగాయని, ప్రస్తుతంకొత్త పంట రావడంతో ధరలు భారీగా తగ్గుముఖం పడుతున్నాయని పట్టణానికి చెందిన హోల్‌సేల్ వ్యాపారి రమణారావు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. మున్ముందు మరింతగా తగ్గే అవకాశాలు ఉన్నాయని చెప్పారు.



సహాయ కమిషనర్‌గా బాధ్యతల స్వీకరణ

విజయనగరం రింగ్‌రోడ్డు, ఫిబ్రవరి19 (ఆంధ్రజ్యోతి): విజయనగరం మున్సిపాలిటీ సహాయ కమిషనర్‌గా కె.అప్పలరాజు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ నల్లనయ్యను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కమిషనర్ ఆదేశాలతో పాటు తోటి సిబ్బంది సమన్వయంతో నగరాభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

వ్యాపార సంస్థలపై ఆకస్మిక తనిఖీలు

బొండపల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో వివిధ గ్రామాల్లో తూనికలు, కొలతల శాఖ పర్యవేక్షణాధికారి ఎం.దామోదర్ నాయుడు బుధవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. తూనిక యంత్రాల్లో లోపాలు, యంత్రాలకు సీళ్లు లేకపోకపోయినా చర్యలు తప్పవని హెచ్చ టరించారు. ఈ సందర్భంగా సీళ్లు లేని 3 తూనిక యంత్రాలను స్వాధీనం చేసుకున్నారు. తూకంలో వ్యత్యాసం ఉన్న నలుగురు వ్యాపారులపైన, అధిక ధరలకు సరుకులు విక్రయించిన వారిపై మరో మూడు కేసులు నమోదు చేశారు. తనిఖీల్లో సాంకేతిక సహాయకుడు సత్యనారాయణ ఉన్నారు.

భూముల కబ్జా ఉపేక్షించం

దత్తిరాజేరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే ఉపేక్షించేది లేదని తహసీల్దార్ పి.విజయభాస్కర్ హెచ్చరించారు. ఇంగిలాపల్లిలో బారికమంద చెరువు ఆక్రమణలకు గురైందని సర్పంచ్ గర్భాపు విజయలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆయన స్పందించారు. బుధవారం ఇంగిలాపల్లిలో బారికమంద చెరువును ఆయన పరిశీలించారు. కంచెను తొలగించాలని ఆక్రమణదారులను ఆదేశించారు. లేని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కిచెన్ గార్డెన్స్ ఏర్పాటు చేసుకోండి

రేగిడి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సంఘాలసభ్యులు ఇళ్ల ముందు ఖాళీ స్థలాల్లో కిచెన్ గార్డెన్స్, హోమ్ కంపోస్టింగ్ పిట్స్ ఏర్పాటుకు ముందుకు రావాలని వెలుగు రాజాం ఏరియా కో-ఆర్డినేటర్ చిరంజీవి పిలుపునిచ్చారు. మండలంలో పెద్దశిర్లాం, బాలికావలస గ్రామాల్లో బుధవారం ఆయన డ్వాక్రా సంఘాలకు చైతన్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఏపీఎం గోవిందరావు ఉన్నారు.

ఘనంగా బుల్లెమ్మ పేరంటాల జాతర

రేగిడి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రేగిడిలో బుల్లెమ్మ పేరంటాల జాతరను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి బుల్లెమ్మతల్లికి ముగ్రాటలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాలకొండకు చెందిన సత్యసాయి సేవాకమిటీ ప్రతినిధులు ఎన్వీ రమణ, కోట ఉమామహేశ్వరరావు ఆధ్యాత్మిక ప్రసంగాలు చేశారు. సంగీత విభావరిని నిర్వహించారు.

బాల్యం నుంచే సమగ్రాభివృద్ధి

డెంకాడ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పిల్లల సమగ్రభివృద్ధి బాల్యం నుంచే జరగాలని డిప్యూటీ డీఈవో కె.వి.రమణ అన్నారు. డెంకాడలో అంగన్‌వాడీలకు నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఆయనతో పాటు సమగ్రశిక్ష సెక్టోరియల్ అధికారి ఆదినారాయణ, ఏఎంవో ప్రసాద్ ఉన్నారు.

60 మందికి వైద్య పరీక్షలు

సంతకవిటి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోదుగులపేటలో బుధవారం జెమ్స్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటైంది. 60 మందిని డాక్టర్ జి.బిందు పరీక్షించారు. అవసరమైన మందులు ఉచితంగా అందించారు. 9 మందికి నేత్ర శస్త్రచికిత్సలు జెమ్స్‌లో ఉచితంగా చేయిస్తామన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టండి

విజయనగరం రింగ్‌రోడ్డు, ఫిబ్రవరి19 (ఆంధ్రజ్యోతి): వేసవిలో నీటిఎద్దడి తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ కె.సంపత్‌కుమార్ అన్నారు. బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులకు పలు సూచనలు చేశారు. ఎక్కడైన ఇబ్బందులు ఉంటే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నల్లనయ్య, సహాయ కమిషనర్ అప్పలరాజు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ సాంబమూర్తి, డీఈలు శ్రీనివాసరావు, ప్రసాద్ ఉన్నారు.

విద్యార్థులకు కౌన్సిలింగ్

వేపాడ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బక్కునాయుడుపేట గురుకుల పాఠశాలలో భోగి సంధ్య విద్యార్థులకు ఆరోగ్యం, కెరియర్‌పై బుధవారం కౌన్సిలింగ్ ఇచ్చారు. పరీక్షలంటే భయం, డిప్రెషన్, మానసిక, వ్యక్తిగత సమస్యలతో చదువుపై దృష్టి పెట్టలేకపోతున్న విద్యార్థుల కోసం పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉషారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పారిశ్రామిక అభివృద్ధితో ఉద్యోగావకాశాలు

● రాష్ట్ర మంత్రి శ్రీనివాస్

పూసపాటిరేగ, ఫిబ్రవరి19 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక అభివృద్ధితో ఉద్యోగావకాశాలు పెరుగుతాయని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. కూటమి ప్రభుత్వం పారిశ్రామిక అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. బుధవారం రాత్రి మండలంలో కందివలసలో ఎస్ఎంఎస్ పరిశ్రమలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్, రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్న ప్రాతుడు తదితరులు నూతనంగా నిర్మించిన ప్రిడక్షన్ బ్లాక్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే లోకం నాగమాధవి, మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగారాజు, ఎస్ఎంఎస్ పరిశ్రమల గ్రూప్ ఆఫ్ చైర్మన్ పి.రమేష్‌బాబు, జీఎం దుర్గాప్రసాద్, పరిశ్రమ హెచ్ఆర్ మేనేజర్ కరుణాకరణ్ తదితరులు పాల్గొన్నారు.



పరిశ్రమలో బ్లాక్‌ను ప్రారంభిస్తున్న మంత్రి శ్రీనివాస్

శివరాత్రి ఏర్పాట్లపై సమీక్ష

శృంగవరపుకోట, ఫిబ్రవరి19 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా పుణ్యగిరిలోని ఉమా కోటిలింగేశ్వర స్వామి, మండలంలోని సన్యాసయ్య పాలెంలోని సన్యాసేశ్వరస్వామి దర్శనాలకు పెద్దఎత్తున తరలి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని తహసీల్దార్ అరుణకుమారి అధికారులను ఆదేశించారు. బుధవారం శివరాత్రి ఏర్పాట్లపై అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈనెల 27న ఎమ్మెల్సీ ఎన్నికపోలింగ్ సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో వాహనాల పార్కింగ్ వీలు కాదన్నారు. పోలీసులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. లైటింగ్, తాగునీరు, పారిశుధ్యం అంశాలపై పంచాయతీ ఏర్పాట్లపై ఆరా తీశారు.



మాట్లాడుతున్న తహసీల్దారు

జాతరకు పక్కాగా ఏర్పాట్లు చేయండి

రాజాం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రాజాంలో పోలిపల్లి పైడితల్లి అమ్మవారి జాతరకు వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని టీడీపీ సీనియర్ నాయకుడు కోండ్రు జగదీశ్ అన్నారు. బుధవారం ఆయన పోలిపల్లి పైడితల్లి అమ్మవారిని దర్శించుకున్నారు. మార్చి 9, 10, 11 తేదీల్లో జరగనున్న జాతర ఏర్పాట్లను పరిశీలించారు. వచ్చిన భక్తులకు దర్శనం సక్రమంగా అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆ మూడు రోజులు ఆర్టీసీ బస్సులు బొమ్మినాయుడువలస మీదుగా మళ్లించేలా ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళతామన్నారు. కార్యక్రమంలో కూటమి నాయుకులు గురవాన నారాయణరావు, గ్రంధి గోపి, బలరాం, సూరిబాబు, సలాది తులసీదాస్, ఆలయ ధర్మకర్త వాకచర్ల రాజా దుర్గాప్రసాద్. ఆలయ ఈవో మాధవరావు ఉన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జగదీశ్

ప్లాంట్ నిర్వహణపై అధికారుల ఆరా

జామి, ఫిబ్రవరి19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జాగరంలో నిర్వహిస్తున్న వాటర్ ప్లాంట్‌ను బుధవారం రెవెన్యూ, పంచాయతీ అధికారులు సందర్శించారు. ఎలాంటి అనుమతులు లేకుండా వాటర్ ప్లాంట్ నిర్వహిస్తున్నారని 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన నేపథ్యంలో అధికారులు స్పందించారు. పంచాయతీ కార్యదర్శి అనురాధ ప్లాంట్‌కు వెళ్లి గతంలో పంచాయతీ ఇచ్చిన అనుమతులు చూపించాలని నిర్వాహకులను కోరారు. వారం రోజుల్లో అందజేయాలని చెప్పారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ పంచాయతీ నుంచి ప్లాంట్ నిర్వహణకు ఎటువంటి అనుమతులు ఇవ్వలేదన్నారు. కంపెనీ నిర్వహిస్తున్నా పంచాయతీకి పన్ను చెల్లించడంలేదన్నారు. అలాగే రెవెన్యూ అధికారుల ఈ ప్లాంట్‌ను సందర్శించారు. ల్యాండ్ కన్వర్షన్ విషయంపై విచారణ చేయడానికి ఆర్ఐ సృజన, వీఆర్వో మున్నీషా, గౌరిశంకర్ ప్లాంట్‌ను సందర్శించారు. నిర్వాహకుల నుంచి వివరాలు సేకరించారు. వారి వద్ద పత్రాలను పరిశీలన చేశారు. నివేదికను తమ తహసీల్దార్‌కు అందజేస్తామన్నారు.



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వివరాలు తెలుసుకుంటున్న పంచాయతీ కార్యదర్శి

కేజీబీవీని పరిశీలించిన ఏపీసీ

గుర్ల, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని బుధవారం సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ డాక్టర్ ఎ.రామారావు ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినిలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. తరగతి గదులు, వంటశాల, స్టోర్ రూమ్ పరిశీలించారు. అల్పాహారం రుచి చూశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అనంతరం స్థానిక జడ్పీ హైస్కూల్‌ను ఆయన సందర్శించారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించి మంచి భవిష్యత్తు అందుకోవాలని ఆకాంక్షించారు. ఆయనతో పాటు ఎంఈవోలు భానుప్రకాష్, మజ్జి శ్రీనివాస్, హెచ్ఎం ఉమామహేశ్ ఉన్నారు.



కస్తూర్బా సిబ్బందితో ఏపీసీ రామారావు

మాటిచ్చారు.. నిలబెట్టుకోండి సార్..

● సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యే కళా విజ్ఞప్తి

చీపురుపల్లి/గరివిడి/రాజాం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు నిర్వహించిన ప్రచారంలో ఆర్ఈసీఎస్ పునరుద్ధరణపై చీపురుపల్లి ప్రజలకు మాటిచ్చారని, ఇచ్చిన మాట నిలబెట్టుకుని, సంస్థ పునరుద్ధరణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు, ముఖ్యమంత్రి చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన అమరావతిలోని సచివాలయంలో సీఎంను కలిసి పలు సమస్యలపై వినతి పత్రాలు సమర్పించారు. ఇందుకు ఆర్ఈసీఎస్ సంస్థ పునరుద్ధరణపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టమైన హామీ ఇచ్చినట్టు తెలిసింది.



చంద్రబాబుకు సమస్యలు వివరిస్తున్న ఎమ్మెల్యే కళా

భీమసింగి ఫ్యాక్టరీపై ప్రస్తావించండి

జామి/లక్కవరపుకోట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఐదేళ్లుగా మూతపడిన భీమసింగి చెక్కర ఫ్యాక్టరీపై ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి శాసనసభలో ప్రస్తావించాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాజ్జీ కోరారు. బుధవారం క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందించారు. ఇక్కడి ఫ్యాక్టరీ భవితవ్యం ఎవ్వరికి అంతుపట్టడం లేదన్నారు. శాసనసభలో ప్రస్తావిస్తే ప్రభుత్వం స్పష్టత ఇస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. వేలాదిమంది రైతులు, వందల మంది కార్మికుల ఆవేదన కూటమి ప్రభుత్వం అర్థం చేసుకోవాలని కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సుగర్స్ కార్మికులు కనకరాజు, ఆదిబాబు, నర్సిబాబు, ఈశ్వరరావు, జగన్నాథరావు, బంగారయ్య, అప్పలనాయుడు, టీడీపీ మండల కార్యదర్శి వల్రి రమణ తదితరులున్నారు. ● జమ్మాదేవిపేటలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలను రెసిడెన్షియల్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయాలని పాఠశాల యాజమాన్య కమిటీ ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు.



వినతిపత్రం అందజేస్తున్న భీశెట్టి

సృజనాత్మకతను వెలికి తీయండి

విజయనగరం క్రైం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లోని సృజనాత్మకతను ఉపాధ్యాయులు వెలికితీసి వారి ఉన్నతికి కృషి చెయ్యాలని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. బుధవారం నగరంలోని పోలీస్ వెల్ఫేర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో గీతం, ఏయూ విద్యార్థుల ఆధ్వర్యంలో ఏర్పాటైన లూడోస్ ఎగ్జిబిషన్‌ను ఆయన సందర్శించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ నిజజీవితంలో సైన్స్ ప్రాధాన్యతను గుర్తించి టెక్నాలజీ రంగంలో ప్రోత్సాహించేందుకు లెట్ అజ్ డూ సైన్స్ (లూడోస్) కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం చేపట్టిందన్నారు. నేడు మనం చూస్తున్న, వినియోగిస్తున్న ప్రతి వస్తువు.. ఆధునిక సైన్స్, టెక్నాలజీ ఫలితమేనన్నారు. కార్యక్రమంలో గీతం వర్సిటీ ప్రొఫెసర్ బి.స్పందన, స్కూల్ ప్రిన్సిపాల్ సంధ్య, సీఐలు లీలారావు, చౌదరి, ఆర్ఐ గోపాలనాయుడు, ఆర్ఎస్ఐ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందాల్

డ్రగ్స్‌తో భవిష్యత్ నాశనం చేసుకోవద్దు

● తలతంపరలో సీఐ పల్లెనిద్ర

రాజాం/సంతకవిటి ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాల బారినపడి యువకులు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని రూరల్ సీఐ ఉపేంద్రరావు సూచించారు. సంతకవిటి మండలంలోని తలతంపరలో మంగళవారం రాత్రి పల్లెనిద్ర ఆయన చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో ఆయన మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. గొడవలకు దూరంగా ఉండాలన్నారు. అందరూ కలిసి కట్టుగా ఉంటే గ్రామం బాగుపడుతుందన్నారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.



మాట్లాడుతున్న సీఐ ఉపేంద్రరావు

చెరువుల్లో చేపపిల్లల విడుదల

రాజాం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజనలో భాగంగా రాజాం మున్సిపాలటీ పరిధిలోని మూడు చెరువులు, రూరల్‌లోని 10 చెరువుల్లో మత్స్యశాఖ అధికారులు 1,31,940 చేపపిల్లలను బుధవారం వదిలారు. కార్యక్రమంలో మత్స్యశాఖ అధికారి సీహెచ్‌వీవీ ప్రసాదరావు ఎంపీడీవో శ్రీనివాసరావు, మత్స్యకార సంఘం మండల అధ్యక్షుడు బెహరా తవుడు తదితరులు పాల్గొన్నారు.



చేప పిల్లలను వదులుతున్న దృశ్యం

ప్రమాదకరంగా అకులోవగెడ్డ వంతెన



రేగిడి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొత్తచెలిగానవలస- వెంకమ్మపేట దరిలో ఉన్న అకులోవకట్ట గెడ్డపై వంతెన ప్రమాదస్థితిలో ఉంది. వంతెన శిథిలావస్థకు చేరుకోవటంతో పాటు వంతెన గెడ్డకు తక్కువ ఎత్తులో ఉండటంతో ఏటా వరద ముంపు తప్పటం లేదు. మరోవైపు వంతెన రక్షణ గోడ కూలింది. దీంతో గెడ్డ ప్రవాహం అధికంగా ఉండేటప్పుడు ఈ మార్గంలో వెళ్లేవారికి ప్రమాదం పొంచి ఉంది. మండలంలోని వివిధ రూట్లలో వంతెనలు, కల్వర్టులకు నిధులు మంజూరైనప్పటికీ పనుల్లో అసలు ప్రగతిలేదు. దీనిపై అర్అండ్‌బీ ఏఈ నాగభూషణరావు వివరణ కోరగా.. రోడ్డు పనులు జరుగున్నాయని, వంతెనలు నిర్మించాల్సి ఉందన్నారు.

శిథిలావస్థకు చేరిన వెంకమ్మపేట వద్ద అకులోవగెడ్డ వంతెన ఇదే..

మెరుగైన వైద్యానికి వెళ్దామనుకుని..

● రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

క్రైం న్యూస్

భామిని, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లివిరి గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన బౌరి రాజేంద్ర (32) ఉదయం మెరుగైన వైద్యానికి వెళ్దామని భావించిన తరుణంలో నిద్రలోనే మృతిచెందాడు. పోలీసులు, గ్రామస్థుల కథనం మేరకు.. భామిని నుంచి లివిరి స్వగ్రామానికి మంగళవారం రాత్రి వెళ్తుండగా ద్విచక్రవాహనం అదుపు తప్పడంతో బౌరి రాజేంద్ర, తిరుపతిరావు గాయపడ్డారు. దీంతో స్థానికులు భామిని పీహెచ్‌సీకి తరలించి వైద్య సేవలు అందించారు. తిరిగి స్వగ్రామానికి తరలించారు. ఉదయం మెరుగైన వైద్యానికి తీసుకెళ్దామని కుటుంబ సభ్యులు భావించారు. ఇంతలో పడుకున్న రాజేంద్ర వేకువజామున మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న బత్తిలి ఎస్ఐ కాంతారావు రాజేంద్ర భార్య ఉషారాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.మృతదేహాన్ని శవ పంచనామాకు పాలకొండ ఏరియా ఆసుపత్రికి తరలించారు. రాజేంద్ర విశాఖలో మే స్త్రీ పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. సమీపంలోని కుటుంబ సభ్యులకు సంబంధించిన కార్యానికి సోమవారం రాత్రి వచ్చాడు. ఇంతలో రాజేంద్ర మృతిచెందడంతో విషాదం నెలకొంది. ఆయనకు ఇద్దరు చిన్నారులు ఉన్నారు.



రాజేంద్ర (ఫైల్)

చికిత్స పొందుతూ యువకుడి మృతి

బొబ్బిలి /రూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మెట్టవలస గ్రామానికి చెందిన పువ్వల అప్పారావు కుమారుడు పువ్వల హరీష్ (18) విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఏఎస్ఐ టి.సన్యాసిరావు కథనం మేరకు.. పువ్వల అప్పారావు గ్రామంలో పాన్ షాపు నిర్వహిస్తున్నాడు. ఈనెల 15న బంధువుల పెళ్లికి హరీష్ పార్వతీపురం వెళ్లి వచ్చాడు. తర్వాత రెండు రోజుల నుంచి వాంతులు, విరోచనాలతో బాధపడుతూ గ్రామంలోని ఆర్ఎంపీ డాక్టరు వద్ద మందులు వాడాడు. తగ్గకపోవడంతో బొబ్బిలి సీహెచ్‌సీకి 17న తీసుకెళ్లారు. పరిస్థితి బాగోలేకపోవడంతో విజయనగరం హస్పిటల్‌కి రిఫర్ చేశారు. పరిస్థితి విషమించడంతో విశాఖపట్నంలోని కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. అప్పారావు ఫిర్యాదుపై ఏఎస్ఐ సన్యాసిరావు కేసు నమోదు చేశారు. కాగా కుమారుడి మృతిపై సమగ్రంగా దర్యాప్తు చేయాలని తండ్రి కోరారని ఏఎస్ఐ తెలిపారు.

చాకుతో వ్యక్తిపై దాడి

దత్తిరాజేరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోరపు కృష్ణాపురంలో మంగళవారం రాత్రి ఓ వ్యక్తిపై చాకుతో దాడి చేశాడు. దాంతో ఒకరు తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటన మం డలంలోని కె.కృష్ణాపురంలో చోటుచేసుకుంది. స్టేషన్ బూర్జవలస ఎస్ఐ జి.రాజేశ్ తెలిపిన వివరాల మేరకు.. రామభద్రపురం మండలం పాతరేగ గ్రామానికి చెందిన యువకుడు గూడాపు సింహాచలం మంగళవారం కె.కృష్ణాపురంలో జరిగే వివాహానికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. అదే గ్రామానికి చెందిన విజయ్ రోడ్డుకు అడ్డంగా నిల్చొని ఉన్నాడు. హారన్ కొట్టినప్పటికీ ఎందుకు తప్పుకోవడం లేదని అతడితో సింహాచలం వాగ్వాదానికి దిగాడు. ఇంతలో అదే గ్రామస్థుడు సుమల పైడిపునాయుడు కలుగజేసుకున్నాడు. దాంతో పైడిపునాయుడు, సింహాచలం మధ్య తోపులాట జరిగింది. దాంతో గూడెపు సింహాచలం బండిలో ఉన్న కూరగాయలు కోసే చాకుతో పైడిపు నాయుడుపై దాడి చేశాడు. దాంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు బాడంగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం విజయనగరంలోని మెడికవర్ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సింహాచలంపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

పోలీసులను ఆశ్రయించిన చీటీల బాధితులు

సీతానగరం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నిడగల్లు, నీలకంఠాపురం, పాపమ్మవలస గ్రామస్థులు బుధవారం పోలీసులను ఆశ్రయించారు. ఓ వ్యక్తి చీటీలు, వడ్డీ వ్యాపారం చేయడం, ప్రామిసరీ నోట్లు రాయడంతో పాటు ఆర్థికపరమైన పనులు నిర్వహించేవాడని గ్రామస్థులు తెలిపారు. ఆయనపై నమ్మకంతో సుమారు 70 మంది రూ.లక్ష నుంచి రూ. ఐదు లక్షల చొప్పున మొత్తం రూ. రెండు కోట్లు అప్పు, చీటీల రూపంలో అందజేశామని బాధితులు చెప్పారు. ఆయన ఆరు రోజులుగా గ్రామంలో ఉన్నా అందుబాటులో లేకపోవడంతో బుధవారం పోలీసులను ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో గ్రామపెద్దలు ఆ వ్యక్తితో మాట్లాడుతామని హామీ ఇవ్వడంతో బాధితులు వెనుదిరిగారు. దీనిపైఎటువంటి కేసు నమోదు కాలేదని ఎస్ఐ రాజేశ్ తెలిపారు.

80 లీటర్ల సారా స్వాధీనం

కొమరాడ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో రాజ్యలక్ష్మీపురం సరిహద్దులో నిర్వహించిన దాడుల్లో అక్రమంగా సారా రవాణా చేస్తున్న రాగోలు ఉదయ్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సింహాద్రి తెలిపారు. బుధవారం నిర్వహించిన దాడుల్లో 80 లీటర్ల సారా, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. డంగభద్ర సరిహద్దు వద్ద సారా రవాణా చేస్తున్న పీడిక రాజారావును అదుపులోకి తీసుకుని 40 లీటర్ల సారా, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఇదే కేసులో సంబంధం ఉన్న మరో ముద్దాయి మెల్లక రాజేంద్ర పరారైనట్టు కేసు నమోదు చేశామని తెలిపారు. దాడుల్లో హెచ్‌సీ జి.సుదర్శన్‌కుమార్, కానిస్టేబుల్స్ ఎల్.జగన్నాథరావు, జి.మనోజ్ పాల్గొన్నారు.

197 మద్యం సీసాలు..

తెర్లాం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందబలగ గ్రామానికి చెందిన అనెం శ్రీనివాసరావు 197 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ సాగర్‌బాబు తెలిపారు. శీనివాసరావు మద్యం వి క్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో బుధవారం తెర్లాం సమీపంలో దాడిచేసి మద్యం స్వాధీనం చేసుకున్నామన్నారు. దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ నాగేశ్వరరావు, కానిస్టేబుల్ నాగరాజ్ పాల్గొన్నారన్నారు..

వసతి గృహ విద్యార్థి అదృశ్యం

గరుగుబిల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రావివలస బీసీ బాలుర వసతి గృహానికి చెందిన విద్యార్థి పత్తిగుల్ల శివ అదృశ్యమయ్యాడని ఎస్ఐ పి.రమేష్‌నాయుడు తెలిపారు. వసతి గృహంలో తొమ్మిదో తరగతి చదువుతున్న కొత్తపల్లికి చెందిన శివ సోమవారం నుంచి కనిపించడం లేదని తండ్రి పోలయ్య గరుగుబిల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. ఈనెల 17న రావి వలస ఆరోగ్య కేంద్రానికి వెళ్తానని శివ తెలిపాడని వసతి గృహ సంరక్షకుడు జి.నాగేశ్వరరావు తెలిపారు. ఆయనకు సహాయంగా మరో ముగ్గురిని పంపించామని, అయితే శివ సహాయకుడిగా వెళ్లిన వారిని వసతి గృహానికి వెళ్లండని, తరువాత వస్తానని చెప్పాడని పేర్కొన్నారు. తాము వెతుకుతున్న సమయంలో విశాఖకు వెళ్లినట్టు సమాచారం అందిందన్నారు.

చోరీ సొత్తు స్వాధీనం

భోగాపురం, ఫిబ్రవరి19 (ఆంధ్రజ్యోతి): భోగాపురంలో చోరీకి పాల్పడిన అదే గ్రామానికి చెందిన బొడ్డ శేఖర్‌ను బుధవారం అరెస్టు చేసి చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నామని సీఐ ఎన్వీ ప్రభాకర్ తెలిపారు. గతేడాది 2024 మార్చి 15న భోగాపురం గ్రామానికి చెందిన వరుపుల వాసుదేవరావు ఇంట్లో చోరీ జరిగిందని బాధితుడు ఫిర్యాదు చేశారన్నారు. విచారణ ప్రారంభించిన పోలీసులు అదే గ్రామానికి చెందినశేఖర్‌ను అరెస్టు చేశారన్నారు. అతడి నుంచి ఏడున్నర తులాల బంగారం స్వాధీనం చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించామన్నారు.

మందుబాబుల హల్‌చల్: 20 మందిపై కేసులు

శృంగవరపుకోట రూరల్, ఫిబ్రవరి19 (ఆంధ్రజ్యోతి): ఎస్.కోట వన్‌వే ట్రాఫిక్ వద్ద మందుబాబుల హల్‌చల్‌తో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గడిచిన రెండురోజులుగా మందుబాబులు మద్యం దుకాణాల వద్దే బహిరంగంగా మద్యం తాగుతూ గొడవలు పడుతున్నారు. బుధవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో వీరి హడావుడితో ట్రాఫిక్ నిలిచిపోయింది. ముఖ్యంగా ఈప్రాంతంలో చిల్లర దుకాణాలు పెద్దఎత్తున ఉండటంతో గొడవలు మరింత జరుగుతున్నాయి. మందుబాబుల ఆగడాలను అరికట్టేందుకు ఇప్పటివరకు 20 మందిపై కేసులు నమోదు చేశామని సీఐ నారాయణమూర్తి తెలిపారు.

దివ్యాంగులపై ప్రేమ చాటండి

డెంకాడ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులను ప్రేమతో సాకాలని జిల్లా సహిత విద్యా సమన్వయకర్త ఎస్.సూర్యారావు అన్నారు. బుధవారం పిల్లల వసతుల కేంద్రాన్ని ఆయన సందర్శించారు. పిల్లలతో మాట్లాడారు. ఫిజియో థెరపీ సేవలు అందిస్తున్నారు. ఆయనతో పాటు ఎంఈఓలు బి.రవి ప్రసాద్, కెల్లబరాజు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయిస్తాం: పీవో

సీతంపేట రూరల్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలో పీఎంజన్‌మన్ పథకం కింద పీవీటీజీలకు మంజూరైన గృహ నిర్మాణాలు వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకుంటామని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈనెల 18వ తేదీన ఆంధ్రజ్యోతిలో నత్తనడకన శీర్షికన కథనం ప్రచురితంకావడంతో పీవో స్పందించారు. ఈ మేరకు ఐటీడీఏ కార్యాలయంలో రెవెన్యూ, హౌసింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించి లక్ష్యాలను నిర్దేశించారు.త్వరితగతిన పీవీటీజీ గ్రామాల్లో గృహ నిర్మాణాలు జరిగేలా చూస్తామని పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

రైతుబజార్‌లో టమాటా విక్రయించుకోవచ్చు

పార్వతీపురం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రైతుబజార్‌లో టమాటా విక్రయించుకోవచ్చునని జిల్లా అగ్రిట్రేడ్ మార్కెటింగ్ అధికారి ఎల్.అశోక్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.బుధవారం ఆంధ్రజ్యోతిలో టమాట ధర పతనం శీర్షికతో కథనం ప్రచురితంకావడంతో స్పందించారు. సాలూరు మండలంలోని దుగ్గిసాగరంలో రైతులుపండించిన టమాటా 750కేజీలను పార్వతీపురం రైతు బజార్‌లో విక్రయించినట్లు తెలిపారు. రైతులు తాము పండించిన పంటకు గ్రామాల్లో సరైన ధర రాకపోతే దగ్గరలో ఉన్న రైతు బజార్‌లో అమ్ముకోవచ్చునని సూచించారు.

పురాతన ఆలయ అభివృద్ధికి చర్యలు

● పార్వతీపురం ఎమ్మెల్యే విజయ్‌చంద్ర



పార్వతీపురం రూరల్: ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పిస్తున్న బాధితులు

బలిజిపేట, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): బలిజిపేటలోని 156 సంవత్సరాల కిందట నిర్మించిన పురాతన వేంకటేశ్వరాలయ అభివృద్ధికి చర్యలు చేపడతానని ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర తెలిపారు. ఈ ఆలయంలో 12 మంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసి ప్రజల అభీష్టం మేరకు అభివృద్ధి చేస్తామని చెప్పారు. బుధవారం ఆలయాన్ని ఆయన టీడీపీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయం అభివృద్ధికి చేయాల్సిన పనుల గురించి అర్చకులు హరికృష్ణ మాచార్యులను,ఆలయ పరిధిలోని దేవుని ఆస్తులు, రాబడులు గురించి ట్రస్ట్ సభ్యులను అడిగితెలుసుకున్నారు.ప్రభుత్వ సహకారంతో ఆలయాన్ని సుందరీకరణతో అభివృద్ధి చేస్తామన్నారు. గురువారం ఎండోమెంట్ శాఖ ఇంజనీరింగ్ అధికారులను పంపించి ఎస్టిమేట్లు వేయిస్తామన్నారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యుడు శ్రీధర్, టీడీపీ మండలాధ్యక్షులు వేణుగోపాలనాయుడు, బీసీ సెల్ అధ్యక్షులు బి.రామ్మోహన్‌నాయుడు, పెద్ద పాపినాయుడు, గొట్టపు వెంకటనాయుడు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకోవాలి

పార్వతీపురంరూరల్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి):అగ్రిగోల్డ్ బాధితులను ప్రభుత్వం ఆదుకొనే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తమ సమస్యలను తీసుకొని వెళ్లాలని బాధితులు కోరారు. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యే విజయచం ద్రకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అగ్రిగోల్డ్‌బాధితుల సంఘం నాయకులు నాయుడు, సీపీఐ నాయకులు ఆర్‌వీఎస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్లకు మేలు చేసే బడ్జెట్

● వామపక్షాలు, ప్రజాసంఘాల నాయకుల ధ్వజం



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు

బెలగాం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి):కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇటీవల ప్రవేశ పెట్టిన బడ్జెట్ ప్రజలకు ఏ విధంగా ఉపయోగపడేలా లేదని, కార్పొరేట్లకు మేలు చేకూర్చేలా ఉందని వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు ధ్వజమెత్తారు. బుధవారం కలెక్టరేట్ వద్ద కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వామపక్ష నాయకులు మాట్లాడుతూ కేంద్రలోని మోదీ ప్రభుత్వం సంపన్నలకు కొమ్ముకాస్తూ, పేదలకు ఉపయోగం లేని బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని ఆరోపించారు. ఆర్థిక వ్యవస్థలో తగ్గిన డిమాండ్ సమస్యను పరిష్కరించడానికి బదులు అందుకు విరుద్ధంగా ఈ బడ్జెట్ ఉందని, నిరుద్యోగ సమస్యను పూర్తిగా విస్మరించిందని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో వామపక్ష, ప్రజా సంఘాల నాయకులు రెడ్డి వేణు, ఇందిరా, బి.వి.రమణ, పి.సంగం, జీవ, కుమార్, భాస్కరరావు, రాజశేఖర్ పాల్గొన్నారు.

పథకాలకు నిధులు కేటాయించాలి

గుమ్మలక్ష్మీపురం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): త్వరలో ప్రవేశపెట్టబోయే రాష్ట్ర బడ్జెట్‌లో తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, నిరుద్యోగ భృతి వంటి సంక్షేమ పథకాలకు తగినన్ని నిధులను కేటాయిస్తూ చిత్తశుద్ధిని చాటుకోవాలని కురుపాం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కో-ఆర్డినేటర్ అడ్డాకుల చిన్నారావు కోరారు. బుధవారం గుమ్మలక్ష్మీపురంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీల ముసుగులో ప్రజలను ఏమార్చి అధికారంలోకి వచ్చిన డబుల్ ఇంజన్ కూటమి ప్రభుత్వం ఎనిమిది నెలల పాలనలో వెలగబెట్టిందేమీ లేదని ఆరోపించారు. సూపర్ సిక్స్‌తోపాటు మేనిఫెస్టోలో ఇచ్చిన ఒక్క హామీ అమలు చేయకుండా ఇంకా గత వైసీపీ ప్రభుత్వాన్ని బూచీగా చూపిస్తూ ఆయావర్గాల ప్రజల సంక్షేమానికి గండి కొడుతూ మెలికలు పెడుతోందని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఉచిత ఇసుక విధానం అమలు చేయడంతో ఆదాయం తగ్గిందని పేర్కొనడం వెనుక మతలబు ఇదేనని ప్రశ్నించారు.

వృద్ధుల తీర్థయాత్ర రైలు ప్రారంభం

రాయగడ, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): కొల్‌కతా వెళ్లే వయోవృద్ధుల తీర్థయాత్ర ప్రత్యేక రైలు మంగళవారం బయలుదేరింది. ఈ రైలును రాయగడలో కలెక్టర్ పారుల్ పట్వార్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి, పురా. ధ్యక్షుడు మహేష్ పట్నాయక్ పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా గోపి ఆనంద్

రాయగడ, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా కొమట్లపేట గ్రామానికి చెందిన న్యాయవాది గోపి ఆనంద్ నియమితులయ్యారు. 13 మంది ఆశావహుల్లో పార్టీ పరిశీలకుడు దేవేంద్ర మహంతి గోపి ఆనంద్‌ను ఎంపిక చేశారు.

మద్యం దుకాణాలను తరలించండి

రాయగడ,ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి):రాయగడ పట్టణంలో నివాశాలు, పాఠశాలలు, బ్యాంకులకు సమీపంలో ఉన్న 3,11,15 నెంబర్ల విదేశీ మద్యం దుకాణాలను తరలించాలని జిల్లా వికాశ్‌మంచ్ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు బుధవారం రాయగడలో అబ్కారి శాఖాధికారిని కలిసి వినతిపత్రం అందజేశారు.

రాయగడలో శివాజీకి నివాళి

రాయగడ, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మరాఠ మహావీరుడు ఛత్రపతి శివాజీ జయంతి పురస్కరించుకుని బుధవారం విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ సభ్యులు రాయగడలో నివాళులర్పించారు.ఈసందర్భంగా స్థానిక కపిలాష్ కూడలిలో జరిగిన కార్యక్రమంలో భజరంగ్‌దళ్ జిల్లా అధ్యక్షుడు అజయ్ అగ్రాని, విజయ్, జ్యోతి బెహెరా, నవీన్, అమరేష్ పతాల్ పాల్గొన్నారు.



రాళ్లు తేలడంతో గోతులమయమైన గరుగుబిల్లి నుంచి బీవీపురం రహదారి

మరమ్మతులు చేయక అవస్థలు

● నిధులు మంజూరై వెనక్కి వెళ్లిపోయిన వైనం

● ఇదీ గరుగుబిల్లి నుంచి బీవీపురం ప్రధానరహదారి దుస్థితి

గరుగుబిల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గరుగుబిల్లి నుంచి బీవీపురం వైపు వెళ్లే ప్రధాన రహదారిమార్గం అధ్వానంగా మారింది.వైసీపీ ప్రభుత్వం హయాంలో మరమ్మతులపై దృష్టి సారించపోవడంతో వాహనచోదకులు, ప్రయాణికులకు అవస్థలు తప్పడంలేదు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో రహదారి నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరై వెనక్కి వెళ్లిన పరిస్థితి ఏర్పడింది. ఇంతలో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ రహదారి అభివృద్ధి చేయడానికి దృష్టిసారిం చలేదని గరుగుబిల్లి గ్రామస్థులు వాపోతున్నారు. గరుగుబిల్లి నుంచి పెద్దూరు, బీవీపురం వరకూ అడుగడుగునా భారీ పెద్ద పెద్ద గోతులు ఏర్పడడంతో చీకటిపడిన తర్వాత వచ్చిపోయే వాహనాలు బోల్తాపడుతుండడంతో చోదకులు గాయపడుతు న్నారు.గరుగుబిల్లి నుంచి బీవీపురం మార్గంలో సీతానగరం, బలిజిపేట మండలాలకు చెందిన పలు గ్రామాలకు నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ మార్గంలో రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో ప్రస్తుతం వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొనడంతో దళాయివలస మీదుగా వెళ్లాల్సివస్తోందని సీతానగరం, బలిజిపేట మండలాల్లోని పలు గ్రామాల చోదకులు చెబుతున్నారు. ప్రధానంగా ఏ మాత్రం అదుపు తప్పినా లోతైన చెరువు, పంట పొలాల్లోకి వాహనాలు పల్టీలు కొట్టే అవకాశం ఉండడంతో చీకటి పడిందంటే ఈ మార్గం ప్రయాణానికి ఏఒక్కరూ ముందుకురావడంలేదు. కూటమి ప్రభుత్వం చొరవ చూపి రహదారి అభివృద్ధికి చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. కాగా రహదారి నిర్మాణంతో పాటు ప్రధాన కల్వర్టులకు ప్రతిపాదనలు చేశామని, నిధులు మంజూరుకాగానే పనులు నిర్వహించనున్నట్లు పంచాయతీరాజ్ జేఈ ఎ.గౌరీశంకర్ తెలిపారు.



సాలూరు: అధ్యాపకులతో మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి



గుమ్మలక్ష్మీపురం: ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

కూటమి అభ్యర్థిని గెలిపించండి

● మంత్రి సంధ్యారాణి, విప్ జగదీశ్వరి, ఎమ్మెల్యే విజయచంద్ర పిలుపు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి బలపరిచిన అభ్యర్థి పాకలపాటి రఘువర్మను గెలిపించాలని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి,విప్ తోయక జగదీశ్వరి, పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర పిలుపునిచ్చారు వారు సాలూరు, గుమ్మలక్ష్మీపురం మండలం భద్రగిరి, సీతానగరం మండలంలో ప్రచారం చేశారు.

● సాలూరు,ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో జూనియర్ కళాశాలలో మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అధ్యాపకులతో మాట్లాడారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం బలపరిచిన అభ్యర్థిని గెలిపించాలని కోరారు.

● గుమ్మలక్ష్మీపురం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని భద్రగిరి బాలుర గురుకుల జూనియర్ కళాశాల, గురుకుల బాలుర పాఠశాల, బాలికలు గురుకుల పాఠశాలల్లో ఉపాధ్యాయులను ఎమ్మెల్యే, విప్ జగదీశ్వరి కలిశారు. ఈ సందర్భంగా రఘువర్మకు ఓటు వేయాలని కోరారు. ఆమె వెంట టీడీపీ నాయకులు పాడి సుధ, కోలా రంజిత్ ఉన్నారు.

● సీతానగరం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి పోటీచేస్తున్న రఘువర్మకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని పార్వతీపురం శాసనసభ్యులు బోనెల విజయచంద్ర కోరారు.ఈ మేరకు సీతానగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను కలివారు. ఆయన వెంట టీడీపీ మండల కార్యదర్శి రౌతు వేణుగోపాల్‌నాయుడు, గొట్టాపు వెంకటనాయుడు, చంటి, అరవింద్, శబ్బాన శ్రీను, బుడితి శ్రీనివాసరావు ఉన్నారు.

సమస్యల స్టేషన్లు!

(ఐదో పేజీ తరువాయి)

తాగి అనారోగ్యపాలవ్వడం ఎందుకని తప్పనిసరి పరిస్థితుల్లో బయట షాపుల్లో వాటర్ బాటిళ్లను కొనుగోలు చేసుకుంటున్నారు. అయితే ఆర్టీసీ కాంప్లెక్స్ చుట్టుపక్కల సుమారు 50 వరకు దుకాణాలు ఉన్నాయి. వాటర్ బాటిళ్ల అమ్మకం ద్వారా ఒక్కో షాపు ఆదాయం రోజుకు రూ.వెయ్యి నుంచి రూ.1500 వరకు ఉంటుందంటే.. వారి వ్యాపారం ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇదిలా ఉండగా పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో మరుగుదొడ్ల నిర్వహణపై అధికారులు శ్రద్ధ చూపడం లేదు. దీంతో ప్రయాణికులు పెయిడ్ మరుగుదొడ్లను వినియోగించాల్సి వస్తోంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధి కారులు స్పందించి ఆర్టీసీ కాంప్లెక్స్‌ల్లో పూర్తిస్థాయిలో వసతులు కల్పించాలని జిల్లావాసులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటున్నాం..

పార్వతీపురం, సాలూరు, పాలకొండ ఆర్టీసీ కాంప్లెక్స్‌ల్లో తాగునీరు, మరుగుదొడ్ల నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ప్రయాణికులకు కనీస సౌకర్యాలు కల్పించడం మా బాధ్యత. వారిని సురక్షితంగా గమ్యస్థానాలను చేర్చేందుకు మా వంతు కృషి చేస్తున్నాం.

-శ్రీనివాసరావు, జిల్లా ప్రజా రవాణాధికారి

ఎన్నికలకు పరిశీలకుల నియామకం

గరుగుబిల్లి,ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి టీడీపీ ముగ్గురు పరిశీలకులను నియమించింది. కురుపాం నియోజకవర్గం పరిధిలో కొప్పల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ అక్కేన మధుసూదనరావును టెక్కలి నియోజకవర్గానికి, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.ఉదయశేఖరపాత్రుడును ఎస్.కోట నియోజకవర్గానికి, అరకు టీడీపీ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణను నరసన్నపేట నియోజకవర్గానికి కేటాయిస్తూ పార్టీ అధిష్ఠానం బుధవారం ఆదేశాలను జారీ చేసింది. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ కూటమి పార్టీ బలపర్చిన ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపునకు కృషి చేయనున్నట్లు తెలిపారు.

● పార్వతీపురం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పాతపట్నం నియోజకవర్గం పరిశీలకులుగా టీడీపీ అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షులు గొట్టాపు వెంకటనాయుడును పార్టీ అధిష్ఠానం నియమించింది. దీనికి సంబంధించి ఆదేశాలు పార్టీ అధిష్ఠానం నుంచి అందాయని వెంకటనాయుడు విలేకరులకు చెప్పారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

జియ్యమ్మవలస, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గృహ నిర్మాణాలు వేగవంతం చేసి మార్చి నెలాఖరులోగా పూర్తి చేయాలని ఎంపీడీవో శంబంగి రమేష్ ఆదేశించారు. బుధవారం కన్నపుదొరవలస, జోగిరాజుపేట గ్రామాల్లో లబ్ధిదారుల లేఅవుట్లు, సొంత స్థలాలను పరిశీలించారు. ఆయన వెంట గృహ నిర్మాణశాఖ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగు భాషపై విజ్ఞానాన్ని పెంపొందించాలి

కొమరాడ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి):అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు తెలుగు భాషపై విజ్ఞానాన్ని పెంపొందించేలా కార్యకర్తలంతా కృషి చేయాలని మండల విద్యాశాఖాధికారి జె.నారాయణస్వామి కోరారు. బుధవారం కొమరాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞాన జ్యోతి కార్యక్రమంపై శిక్షణను నిర్వహించారు. కార్యక్రమంలో కొమరాడ ఐసీడీఎస్ పీవో సుగుణకుమారి, ఎంఈవో-2 తిరుపతిరావు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి

పార్వతీపురంటౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు పార్వతీపురం మునిసిపల్ కమిషనర్ సీహెచ్. వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం పట్టణంలోని పలు వార్డుల్లో గల వీధుల్లోని పారిశుధ్య నిర్వహణ పనులు పరిశీలించారు. ప్రధాన రహదారితో పాటు వీధుల్లో చెత్త, వ్యర్థాలు ఎక్కడెక్కడ వేస్తున్నారో ప్రజారోగ్య, సచివాలయ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కాలువల్లో పేరుకుపోతున్న వ్యర్థాలను యుద్ధప్రాతిపదికన తీయించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, అధికారులు, సిబ్బందిని కోరారు. కాలువల్లో మురుగునీటిని తరలించేందుకు ప్రణాళికలను సిద్ధంచేస్తున్నామని తెలిపారు. ప్రజారోగ్య విభాగంలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది, కార్మికులు సమన్వయంతో పారిశ్యు నిర్వహణలో ఇతర మునిసిపాలిటీలకు ఆదర్శంగా నిలవాలని కోరారు.

పేర్లను నమోదు చేసుకోవాలి

ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు పార్వతీపురం పురపాలక సంఘ పరిధిలో ఉన్న చిరు, పెద్ద వ్యాపారులు మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్‌ఎంఈ) సర్వేలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు కోరారు. సర్వేను వ్యాపారుల పేర్లను సచివాలయ సిబ్బంది నమోదు చేస్తున్నారని, వారికి పూర్తి సహకరించాలని కోరారు. ఇప్పటి వరకు 800 మంది చిన్న, పెద్ద వ్యాపారుల పేర్లను నమోదు చేశారని చెప్పారు.

ప్రతిఒక్కరికి క్రీడలు అవసరం: ఎస్‌ఐ

పాచిపెంట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి):ప్రతిఒక్కరికి వైద్యంతో పాటు క్రీడలు కూడా అవసరమని ఎస్‌ఐ వెంకటసురేష్ తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలగిరిజన యువతకు వాలీబాల్ కిట్లు అందజేశారు. కాగా పోలీస్ స్టేషన్ ఆవరణలో నిర్వహించిన శిబిరంలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన 250 మంది గిరిజన, గిరిజనేతరులకు వైద్య నిపుణులు తనిఖీలు నిర్వహించారు. కార్యక్రమంలో సాలూరు రూరల్ ఎస్‌ఐ పి.రామకృష్ణ పాల్గొన్నారు.

పోస్టల్ పథకాలపై అవగాహన

గరుగుబిల్లి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): తపాలాశాఖ అమలు చేస్తున్న పలు పథకాలపై విస్తృత ప్రచారం చేస్తామని తపాలాశాఖ సబ్ పోస్ట్ మాస్టర్ నడిమింటి ఆదినారాయణ తెలిపారు. బుధవారం గరుగుబిల్లిలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో తపాలాశాఖ ద్వారా అమలు చేస్తున్న పథకాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోస్టల్ ఏజెంట్ పక్కి సదాశివరావు, పోస్టల్ సిబ్బంది గెంబలి ఈశ్వరరావు, ఎన్.మురళీమోహన్, డి.హరీష్, బి.అనిత, ఎ.చినతల్లి, పాల్గొన్నారు.

వీరఘట్టంలో పోలింగ్‌కు ఏర్పాట్లు

వీరఘట్టం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఈనెల 27న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు 121 మంది ఓటు హక్కు కలిగి ఉన్నారని తహసీల్దార్ సత్యనారాయణ తెలిపారు. వీరఘట్టంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఈనెల 27న జరిగే ఎన్నికల పోలింగ్‌కు అందుకు ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు.

జీడిపప్పు పరిశ్రమల పరిశీలన

పార్వతీపురం ఆంధ్రజ్యోతి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి):సంకల్ప్ పథకంలో భాగంగా పలాసలోని జీడిపప్పు పరిశ్రమలను వీడీవీకే బృంద సభ్యులు పరిశీలించినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సాయికృష్ణచైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశాల మేరకు జిల్లాలో వన్‌ధన్ వికాసం కేంద్రం సభ్యులతో స్థాపించనున్న క్యాష్యూ క్లస్టర్ ఫెడరేషన్ బృందం పలాసలోని జీడిపప్పు పరిశ్రమలను పరిశీలించినట్లు పేర్కొన్నారు.ఈ మేరకు డీఆర్‌డీఏ పథక సంచాలకులు వై.సత్యంనాయుడు, జిల్లా పరి శ్రమల అడిషనల్ డైరెక్టర్, కృషి విజ్ఞాన కేం ద్రం కో-ఆర్డినేటర్, హార్టికల్చర్ ఆఫీసర్, ఏపీఎంలు, నైపుణ్యాభివృద్ధి సిబ్బంది జీడిపప్పుపరిశ్రమ అభివృద్ధికి కావాల్సినవివరాలను అధ్యయనం చేశారని తెలిపారు.

పాలకొండలో ధ్వజస్తంభం ప్రతిష్ఠ

పాలకొండ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీతారామస్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవాలు బుధవారం కొనసాగాయి. ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం వరకూ ప్రతిష్ఠా కార్య క్రమాలు నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పేర్కొన్నారు. శనివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్న సమారాధన జరుగుతుందని తెలిపారు.

మంచి ఫలితాలు సాధించాలి: పీవో

సీతంపేట రూరల్,ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి):పదోతరగతి పరీక్షల్లో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని సీతంపేట ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి కోరారు. బుధవారం ఐటీడీఏ పరిధిలోని శంభాం, ముత్యాలు, మల్లి గిరిజనసంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలను ఆకస్మిక తనిఖీ చేపట్టారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని హెచ్‌ఎంలు పి.నారాయడు, సుందరావుకు సూచించారు. అనంతరం కుసిమి పీహెచ్‌సీలో గర్భిణులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు.

చిన్నారుల ఆరోగ్యంపై దృష్టి సారించాలి

గరుగుబిల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారుల్లో సామర్థ్యాలను పెంచేందుకే ప్రభుత్వం జ్ఞాన జ్యోతి శిక్షణ నిర్వహిస్తోందని మన్యం జిల్లా డీఈవో నల్ల తిరుపతినాయుడు తెలిపారు. వారి ఆరోగ్యంపై దృష్టి సారించాలని కోరారు.బుధవారం గరుగుబిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తల శిక్షణను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలను విధిగా కేంద్రాల్లో నిర్వాహకులు అమలుపర్చాలన్నారుకార్యక్రమంలో ఎంఈవో దత్తి అప్పలనాయుడు, ఎంఈవో-2 కొండలరావు, హెచ్‌ఎం ఎస్‌ఎల్ పాత్రుడు, ఐసీడీఎస్ సిబ్బంది ఆర్.లక్ష్మి, ఎస్.వల్లవరాజు, రిసోర్స్‌పర్సన్లు వి.ధనుంజయనాయుడు, పి.వెంకటనాయుడు, కె.సింహాచలం పాల్గొన్నారు. కాగా గరుగుబిల్లి, హిక్కింవలస ప్రాథమిక ఉన్నత పాఠశాలల విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులను డీఈవో నల్ల తిరుపతినాయుడు అందజేశారు.

● వీరఘట్టం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి):వీరఘట్టం జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో రెండో రోజు అంగన్వాడీ టీచర్లకు జ్ఞానజ్యోతి శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాబాలల సంరక్షణవిభాగం లీగల్‌ప్రొవిజన్ అధికారి పి.శ్రీధర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లు బాలల చట్టాల పై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్య క్రమంలో హరికృష్ణ, గౌరునాయుడు, ఆనందరావు పాల్గొన్నారు.

నేడు జగన్ రాక

పార్వతీపురం/పాలకొండ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గురువారం పాలకొండలో పర్యటించనున్నారు. బుధవారం గజాలఖానా సమీపంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌ను వేర్వేరుగా పార్వతీపురం, శ్రీకాకుళం వైసీపీ జిల్లాల అధ్యక్షులు పరీక్షిత్‌రాజు, కృష్ణదాస్, ఎమ్మెల్సీ విక్రాంత్,మాజీ ఎమ్మెల్యేలు కళావతి, రెడ్డి శాంతి, కంబాల జోగులు అలజంగి జోగారావు పరిశీలించారు. ఇటీవల రాజ్యసభ మాజీ సభ్యుడు పాలవలస రాజశేఖరం మృతిచెందడంతో కుటుంబ సభ్యులను పరామర్శించి హెలికాప్టర్‌లో విశాఖ చేరుకోనున్నట్టు వైసీపీ వర్గాలు తెలిపాయి.

నేటి నుంచి ముక్కుడిపోలమ్మ యాత్ర

సీతంపేట రూరల్,ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పులిపుట్టి సమీపంలో ముక్కుడిపోలమ్మ యాత్ర మహోత్సవాలు గురువారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఐదురోజులపాటు 46వముక్కుడమ్మ యాత్ర మహోత్సవాలు నిర్వహించనున్నట్లు సభ్యులు సవరతోట మొఖలింగం ,కూర్మారావు, పొట్టేను, రవిలు తెలిపారు.

నేడు క్యాన్సర్ వైద్య శిబిరం

వీరఘట్టం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టం పంచాయతీ కార్యాలయం ఆవరణలో గురువారం నిర్వహించే ఉచిత క్యాన్సర్ అవగాహన, నిర్ధారణ కార్య క్రమం వినియోగించుకోవాలని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఒక ప్రకటనలో కోరారు.ఈ సందర్భంగా వైద్యశిబిరంలో ఉచితంగా క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు.

24న పీఎం కిసాన్ నిధులు విడుదల

పార్వతీపురం, ఫిబ్రవరి 19 (ఆంధ్ర జ్యోతి): ప్రధానమంత్రి కిసాన్ నిధులు ఈనెల 24న విడుదల చేయనున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాకు లక్షా 16వేల మంది రైతులకు రూ.23 కోట్ల 19 లక్షల రూపాయలు నిధులు ఖాతాల్లో జమచేయనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలో ఈ నిధులు జమచేసే కార్య క్రమం జరగనుంది.

డీఐఈవోకు ఆచార్యదేవోభవ అవార్డు

పార్వతీపురం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి (డీఐఈవో) డి.మంజులవీణకు ఆచార్య దేవోభవ అవార్డు లభించింది. గణిత శాస్త్ర అధ్యాపకులుగా, ఉమ్మడి జిల్లాల ఆర్‌ఐవోగా, పార్వతీపురం జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖఅధికారిగా అందించిన సేవలకు ప్రియదర్శిని సోషల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ 2025 సంవత్సరానికి ఈ అవార్డును అందించింది. ప్రవేశాలు, విద్యా ప్రమాణాలు, పబ్లిక్ పరీక్షలు నిర్వహణ పరంగా ఫలితాల సాధనలోన జిల్లాను ముందంచడంలో అవార్డు లభించిందని మంజులవీణ తెలిపారు. కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అవార్డు రావడం పట్ల మంజులవీణ అభినందించారు.

ఆధార్ శిబిరాలు వినియోగించుకోండి

సీతంపేట రూరల్,ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి):మండలంలో శుక్రవారం వరకు నిర్వహించనున్న ఆధార్ శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కె.గీతాంజలి ఒక ప్రకటనలో కోరారు. ఆరు సచివాలయాల పరిధిలో ఈ ఆధార్ క్యాంప్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.